క్లుప్తంగా

సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి



కొవ్వూరులో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న రాణి సుస్మిత

కొవ్వూరు: పీజీఆర్ఎస్–మీ కోసంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను నాణ్యతతో, శాశ్వతం పరిష్కారం చూపాలని ఆర్డీవో రాణి సుస్మిత ఆదేశించారు. పట్టణంలో ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో నాలుగు ఫిర్యాదులు అందాయని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో జవాబుదారీతనంతో అధికారులు వ్యవహరించాలన్నారు. స్థలం ఆక్రమణలపై చాగల్లు మండలానికి సుంకవల్లి శ్రీనివాసరావు, తొగుమ్మికి చెందిన వి.విజయ్ వినతిపత్రాలు అందించారు. తమ స్థలాలు ఇప్పించాలని కోరారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

మట్టి తవ్వకాల నియంత్రణకు ప్రత్యేక బృందాలు

కొవ్వూరు: చిడిపి, కుమారదేవం గ్రామాల పరిధిలో గోదావరి లంక భూముల్లో మట్టి తవ్వకాలు చేస్తున్నారని వస్తున్న సమాచారం మేరకు ప్రత్యేక పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ తెలిపారు. అధికారులకు అందుతున్న సమాచారం మేరకు పరిశీలనకు వెళ్లిన సమయంలో వాహనాలు ఉండడం లేదన్నారు. అందువల్ల నిరంతరం ఆయా ప్రాంతాల్లో నిఘా ఉంచేందుకు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బి.విశ్వేశ్వరరావు, వీఆర్వోలు ఎండీ షేక్ హుస్సేన్, సీహెచ్ జగజ్జీవన్ రావు, కె.సూర్యచంద్రంను టీముగా, సీనియర్ అసిస్టెంట్ జి.సుబ్బారావుతో పాటు, వీఆర్వోలు టి.సుబ్రహ్మణ్యం, కె.పృథ్వీరాజ్, ఇమ్మానియేలును మరో బృందంగా ఏర్పాటు చేశామన్నారు. మట్టి తవ్వకాలు, తరలిస్తున్న వాహనాలను ఈ బృందాలు గుర్తించి, సీజ్ చేస్తాయన్నారు. వీరు ఏటిగట్టుపై విధులు నిర్వహిస్తారన్నారు. మట్టి తరలిస్తున్న వాహనాలను పోలీసు స్టేషన్‌కి అప్పగిస్తారని స్పష్టం చేశారు.

ఇసుక అధిక ధరపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

తాళ్లపూడి: ఇసుక ర్యాంపుల్లో ఇష్టం వచ్చిన ధరలు వసూలు చేస్తున్నారని సోమవారం గ్రీవెన్స్‌లో తహసీల్దార్‌కు పలువురు ఫిర్యాదు చేశారు. మండలంలోని బల్లిపాడు ఓపెన్ ఇసుక ర్యాంపులో ప్రభుత్వ నిర్ణయం మేరకు ఎడ్ల బండ్లకు, ట్రాక్టర్లకు ఉచితంగా ఇసుకను ఇవ్వాల్సి ఉండగా, ఇది అమలు చేయడం లేదని శూలా పోశియ్య, బుద్దాల హరిప్రసాద్, శేషు తదితరులు ఆరోపించారు. ఇసుక లోడింగ్‌కు బంటాలను తీసుకువెళ్లనీయడం లేదని చెప్పారు. ఇసుకను ట్రాక్టర్‌కు రూ.800 నుంచి రూ.1,200 వరకు వసూలు చేస్తున్నారని తహసీల్దార్ మోహన భారతికి ఫిర్యాదు చేశారు. రికమండేషన్ ఉంటే రూ.500 వసూలు చేస్తున్నారన్నారు. ఇష్టానుసారం ధరలు వసూలు చేస్తున్నారని, ఇదేమిటని ప్రశ్నించిన వారిని ర్యాంపులోకి రానీయడం లేదని తెలిపారు.

బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి



రోగులను పరామర్శిస్తున్న వేణు

గోపాలపురం: డయేరియా బారిన పడిన ప్రజలను కూటమి ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, తక్షణం మెరుగైన వైద్యం అందించాలని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సాలి వేణు డిమాండ్ చేశారు. స్థానిక సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న బాధితులను సోమవారం ఆయన పరామర్శించారు. అనంతరం వేణు మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలను ఎలాగూ అమలు చేయలేదని, కనీసం ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. కల్తీ మద్యం, నూనెలు, కలుషిత తాగునీరు, డ్రైనేజీల వల్లే ప్రజలు రోగాల బారిన పడుతున్నారని విమర్శించారు. ఆయన వెంట నాయకులు ముల్లంగి శ్రీనివాసరెడ్డి, వింజమూరి సుబ్బారావు ఉన్నారు.



దేవరపల్లి జెడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయులు



పదో తరగతి పరీక్షకు హాజరైన దుద్దుకూరు భవిత కేంద్రం విద్యార్థులు



నిడదవోలులో ప్రభుత్వ హైస్కూల్ వద్ద గదుల నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



తాళ్లపూడిలో పరీక్షా కేంద్రంలోకి వెళుతున్న విద్యార్థులు



నల్లజర్ల జెడ్పీ హైస్కూలు వద్ద రోల్ నంబర్లు పరిశీలిస్తున్న విద్యార్థులు

ప్రశాంతంగా పది పరీక్షలు ప్రారంభం

- తొలి రోజు అనేక మంది విద్యార్థుల గైర్హాజరు
- పరీక్షా కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు
- పలు కేంద్రాలను తనిఖీ చేసిన అధికారులు



కొవ్వూరులో పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత

దేవరపల్లి: పదో తరగతి పరీక్షలు దేవరపల్లి మండలంలో సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలో తొమ్మిది జిల్లా పరిషత్ హైస్కూళ్లు, ఆరు ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. మండలంలో 1,035 మంది విద్యార్థులు పరీక్ష రాయవలసి ఉండగా, 1,004 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్టు మండల విద్యాశాఖ అధికారులు ఎం.తిరుమలదాస్, కేఆర్ఆర్ఎస్ అప్పారావు తెలిపారు. ఐదు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 1,026 మందికి గాను 998 మంది పరీక్షకు హాజరయ్యారు. 28 మంది పరీక్షకు హాజరు కాలేదు. గతంలో పరీక్ష రాసి ఉత్తీర్ణులు కాని విద్యార్థులు 9 మందికి గాను, 6 గురు విద్యార్థులు పరీక్ష రాసినట్టు ఎంఈఓ తిరుమలదాస్ తెలిపారు. మొదటి రోజు పరీక్షకు రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు కలిసి మొత్తం 31 మంది గైర్హాజరైనట్టు ఆయన తెలిపారు. ఐదు పరీక్షా కేంద్రాల్లో 97 శాతం విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, రెగ్యులర్ విద్యార్థులు 97.27 శాతం, సప్లిమెంటరీ విద్యార్థులు 66.66 శాతం హాజరైనట్టు ఆయన తెలిపారు. దేవరపల్లి జెడ్పీ హైస్కూలు, భాష్యం స్కూలు, శ్రీచైతన్య స్కూలు, యర్నగూడెం జెడ్పీ హైస్కూలు, చిన్నాయగూడెం జెడ్పీ హైస్కూళ్లలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. దుద్దుకూరు భవిత కేంద్రం నుంచి ఇద్దరు మానసిన దివ్యాంగులు పరీక్షకు హాజరయ్యారు. వీరికి సహాయకులుగా పరీక్ష రాయడానికి ఇద్దరు విద్యార్థులను అధికారులు అనుమతించారు. పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు, ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఉదయం 8.30 గంటలకే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోగా, ఉదయం 9 గంటలకు పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష జరిగింది. ప్రధాన ద్వారం వద్ద ఉపాధ్యాయులు విద్యార్థులను తనిఖీ చేసి పంపించారు. విద్యార్థులు పరీక్షరాసి బయటకు వచ్చే వరకు తల్లిదండ్రులు కేంద్రాల వద్ద వేసి ఉన్నారు. దేవరపల్లి ఏఎస్ఎన్ జెడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని తహసీల్దార్ ఎం.శ్రీనివాస్, ఎంఈఓ తిరుమలదాస్ పరిశీలించారు. పరీక్షా కేంద్రం వద్ద ఏర్పాట్లను ఆరాతీశారు.

పరీక్షలకు 1,250 మంది హాజరు

కొవ్వూరు: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా కొనసాగాయి. మండలవ్యాప్తంగా పది పరీక్షా కేంద్రాల్లో 1,272 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, వీరిలో 1,250 మంది పరీక్షలు రాశారు. తెలుగు పరీక్షకు పట్టణంలో పీఎంఎం పాఠశాలలో ఆరుగురు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇద్దరు, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ హైస్కూలులో ఇద్దరు, దీప్తి, భాష్యం హైస్కూళ్లలో ఐదుగురు చొప్పున, వాడపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇద్దరు చొప్పున మొత్తం తెలుగు పరీక్షకు 14 మంది గైర్హాజరయ్యారు. ప్రైవేటుగా 14 మంది పరీక్ష రాస్తుండగా, వీరిలో తొలిరోజు ఐ.పంగిడి హైస్కూలు పరీక్షా కేంద్రంలో ఇద్దరు గైర్హాజరయ్యారు. పట్టణంలో పరీక్షా కేంద్రాలను ఆర్డీవో రాణి సుస్మిత పరిశీలించారు.

పరీక్ష రాసిన 665 మంది విద్యార్థులు

తాళ్లపూడి: మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం తెలుగు పరీక్షతో ప్రారంభమయ్యాయి. విద్యార్థులు ఉదయం ఎనిమిది గంటల నుంచే పరీక్షా కేంద్రాల వద్దకు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కలిసి చేరుకోవడంతో కోలాహలంగా మారింది. 9.30కు పరీక్ష ప్రారంభించారు. మండలంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 678 మంది విద్యార్థులకు గాను 665 మంది పరీక్షలకు హాజరైనట్టు ఎంఈవో–2, రూట్ ఆఫీసర్ సీహెచ్ నెహ్రూజీ తెలిపారు. 13 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారన్నారు. చీఫ్ ఎగ్జామినర్లుగా సీహెచ్ నాగేంద్రరావు, సీహెచ్ సుబ్బలక్ష్మి శ్రీవాసవి, జె.ప్రభాకర్ వ్యవహరించారు. పరీక్షా కేంద్రాలను ఎంఈవో–2, రూట్ ఆఫీసర్ నెహ్రూజీ పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగు నీరు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది.

96 శాతం హాజరు

నల్లజర్ల: పదో తరగతి పరీక్షలు సోమవారం మండలంలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొత్తం పరీక్షా కేంద్రాల్లో 1,064 మందికి 1,020 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 96 శాతం మంది విద్యార్థులు హాజరైనట్టు ఎంఈఓ–1 వై.సత్యానారాయణ, ఎంఈఓ–2 భగవతి తెలిపారు. ఉదయం 8 గంటలకే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. ఉదయం 9 గంటలకు విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. విద్యార్థులు పరీక్షలు రాసి, బయటకు వచ్చే వరకూ వారి తల్లిదండ్రులు పరీక్షా కేంద్రాల వద్ద వేచిఉన్నారు. పరీక్షల నేపథ్యంలో పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ కేంద్రాలను మూయించారు. ప్రశ్నా పత్రాలను పోలీస్ స్టేషన్ నుంచి పరీక్షా కేంద్రాలకు తరలించడం, పరీక్ష ముగిశాక జవాబుపత్రాలను పోస్టాఫీసులకు తరలించడం వరకు ప్రత్యేక పోలీసు భద్రత కల్పించారు.

ఉండ్రాజవరం: మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు తొలిరోజు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. సోమవారం పరీక్షకు 821 మందికి 817 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎంఈఓ సీహెచ్ సక్సేనారాజు తెలిపారు. పరీక్షా కేంద్రాలను ఎంఈవో–2 శారద జ్యోత్స్న, సీతానగరం ఎంఈవో నాయక్ పరిశీలించారు.

పరీక్షా కేంద్రాల వద్ద హడావిడి

నిడదవోలు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థుల హడావిడి కనిపించింది. తొలి రోజు ఫస్ట్ లాంగ్వేజ్ పరీక్షలు జరిగాయి. పరీక్షలు బార్ కోడ్ విధానంలో జరుగుతున్నాయి. నిడదవోలు పట్టణ, మండల పరిధిలోని 9 పరీక్షా కేంద్రాలలో 1,448కి 1,413 మంది విద్యార్థులు హాజరయ్యారు. అన్ని కేంద్రాల వద్ద అత్యవసర వైద్యసేవలు, మంచినీరు అందుబాటులో ఉండేటట్లు అధికారులు చర్యలు చేపట్టారు. పోలీస్ భద్రత ఏర్పాటు చేశారు.

చాగల్లు: మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఐదుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. చాగల్లు, ఊనగట్ల, మార్కొండపాడు పరీక్షా కేంద్రాల్లో 374 మందికి 369 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎంఈఓ వి.గురునాథం తెలిపారు. పరీక్షా కేంద్రాలను తహసీల్దార్ ఎం.మెరికమ్మ పరిశీలించారు.

అధికార పార్టీలో 'మట్టి' చిచ్చు

- గజ్జరంలో గుడికి మట్టి తరలింపు అడ్డగింపు
- టీడీపీలో రెండు వర్గాల మధ్య వివాదం



గజ్జరంలో మట్టి వివాదానికి కారణమైన అమ్మవారి ఆలయ స్థలం



గజ్జరంలో ముత్యాలమ్మ తల్లి ఆలయం

తాళ్లపూడి: మండలంలో గ్రావెల్ మట్టి రవాణా వ్యవహారం అధికార టీడీపీలో రెండు వర్గాల మధ్య చిచ్చు రేపింది. మట్టి రవాణాను అరికట్టాల్సిన అధికారులను పక్కనపెట్టి, టీడీపీలోని ఓ వర్గం మండల నాయకులు తమ అనుమతి లేకుండా గ్రావెల్ మట్టి రవాణా చేయరాదన్న నిబంధన విధించడం చర్చనీయాంశమైంది. సొంత పనులకైనా, అమ్మవారి గుడికైనా సొమ్ము ముట్టజెప్పాల్సిందేనని మట్టి రవాణా చేసే ఆ నాయకులు శాసిస్తున్నారని గజ్జరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కాకర్ల వంశీ బహిరంగంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఆయన పలు ఆరోపణలు చేశారు. గజ్జరం గ్రామంలో ఇటీవల గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లి ఆలయానికి తాత్కాలిక మరమ్మతులు, ఆలయ అభివృద్ధికి గ్రామంలోని నాయకులు, గ్రామస్తులు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో ఆలయ ప్రాంగణాన్ని మట్టితో నింపాల్సి వచ్చింది. స్థానిక టీడీపీ నాయకుడు కాకర్ల వంశీ గ్రావెల్ మట్టిని లారీలో తరలించడానికి చర్యలు చేపట్టారు. దీనిని కొందరు నేతలు అడ్డుకోవడంతో విభేదాలు తలెత్తాయి. మట్టి తవ్వకం కూడా మైనింగ్ పరిధిలోకే వస్తుందంటూ ఇటీవల జిల్లా కలెక్టర్ ప్రకటించినప్పటి నుంచి మట్టి రవాణా కఠినతరంగా మారింది. మండలంలో అధికారులు మాత్రం ఇవేమీ పట్టనట్టు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. కొందరు అధికార పార్టీ నేతలు తమ వర్గానికి చెందిన వారిని మట్టి తరలించడానికి అభ్యంతరం చెప్పడం లేదు. ఇతరులకైతే అనుమతి లేదంటూ లారీలను నిలిపివేస్తున్నారని, మట్టి ఎక్కడ తవ్వినా ఒక్కొక్క లారీకి రూ.700 చొప్పున మామూళ్లు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తాయి. పనుల్లేక లారీలు, మెషీన్లు అమ్ముకునే పరిస్థితి వచ్చిందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో రికమండేషన్ లేక లారీలు నిలిచిపోతున్నాయని కొందరు డ్రైవర్లు వాపోతున్నారు. ఇటీవల ఓ లారీని మాముళ్లు చెల్లించలేదన్న కారణంగా నిలిపివేయటంతో మండల టీడీపీలో ఓ వర్గం గుర్రుగా ఉంది. కొందరు ముఖ్య నాయకులు సర్దిచెప్పేందుకు యత్నించినప్పటికీ వివాదం సద్దుమణగలేదు. దీంతో మట్టి తవ్వకాలు ఎలా చేస్తారో చూస్తామంటూ అల్టిమేటం సైతం జారీ చేసేంత వరకు పరిస్థితి వెళ్లింది. మున్ముందు ఈ వివాదం మరింత ముదిరేలా ఉందని పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

తిరుగుడుమెట్టలో అధికారులు అప్రమత్తం



తిరుగుడుమెట్టలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో, ఇతర అధికారులు

తాళ్లపూడి: మండలంలోని తిరుగుడుమెట్టలో డయేరియా కేసులు నమోదయ్యాయన్న సమాచారంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఆదివారం గ్రామంలో నమోదైన రెండు కేసుల్లో సురక్షితంగా ఉన్నారని, కొత్త కేసులు లేవని అధికారులు తెలిపారు. కొవ్వూరు డీఎల్‌పీవో వై.అమ్మాజీ, ఎంపీడీవో టీబీ వెంకటరమణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సూర్జాన్, ఈఓపీఆర్డీ కేఎస్ వీరన్న తదితరులు గ్రామంలో పర్యటించారు. మలకపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి అన్నపూర్ణ, పి.సుచందన ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో మరపట్ల వినయ్ 19 ఏళ్ల యువకుడు అతిసారం బారిన పడడంతో, ముందు జాగ్రతగా వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్టు డాక్టర్ అన్నపూర్ణ తెలిపారు. సర్పంచ్ వల్లభిశెట్టి గంగాభవాని ఆధ్వర్యంలో గ్రామంలో పారిశుధ్య నిర్వహణ, తాగు నీటిని క్లోరినేషన్ చేసినట్టు చెప్పారు. వైద్య సిబ్బందితో ఇంటింటి సర్వే చేశామని, కొత్త కేసులు లేవన్నారు.

రైళ్ల హాల్టు కోసం తీర్మానం చేయాలి

కొవ్వూరు: గతంలో ఆగే అన్నీ ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టులను పునరుద్ధరించాలని మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేయించాలని రైల్వే స్టేషన్ పరిరక్షణ సమితి సభ్యులు సోమవారం చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, కమిషనర్ టి.నాగేంద్రకుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. 2019కి పూర్వం ఆగే అన్నీ రైళ్ల హాల్టులను కొవ్వూరులో ఆగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

108 కలశాలతో బాబాకు అభిషేకం

నల్లజర్ల: అనంతపల్లిలోని షిరిడీసాయి మందిర వార్షికోత్సవాల్లో భాగంగా మూడో రోజు సోమవారం బాబాకు 108 కలశాలతో జీవనదుల పుష్కర జలాలతో ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

చాగల్లు: బ్రాహ్మణగూడెంలో నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మీ రాజరాజేశ్వరి సరస్వతి అమ్మవార్ల ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం సోమవారం వైభవంగా జరిగింది. ఈ ఆలయంలో గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, శ్రీలక్ష్మీ రాజరాజేశ్వరీ, సరస్వతి శిఖర శిలాధ్వజ యంత్ర ప్రతిష్ఠాపన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అయోడిన్ ఉన్న ఉప్పునే వాడాలి

కొవ్వూరు: పిల్లల్లో అయోడిన్ లోపం కారణంగా కంఠమాల వ్యాధి బారిన పడతారని దొమ్మేరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.ధర్మరాజు అన్నారు. అయోడిన్ (ఉప్పు) లోపం వల్ల కలిగే ఇబ్బందులు, నివారణ చర్యలపై సోమవారం స్థానిక ప్రాథమికోన్నత, హైస్కూలులో ఆరు నుంచి 12 ఏళ్లలోపు 90 మంది చిన్నారులకు వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 15 మందికి అయోడిన్ లోపం ఉన్నట్టు గుర్తించారు. మరో తొమ్మిది మంది చిన్నారుల నుంచి శాంపిళ్లను సేకరించి జిల్లా కేంద్రానికి పంపించనున్నట్టు తెలిపారు. అయోడిన్ లోపం వలన వచ్చే రోగాలను ఐదు శాతం కన్నా తక్కువకి తగ్గించడం, నూటికి నూరుశాతం అయోడిన్ ఉన్న ఉప్పును మాత్రమే వాడాలని సూచించారు. అయోడైజ్డ్ ఉప్పు 15 శాతం పీఎంఎం ఉన్న దానిని మాత్రమే వాడాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నాగిరెడ్డి(ఫైల్)

గోపాలపురం: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందినట్లు ఎస్సై కర్రి సతీష్‌కుమార్ సోమవారం తెలిపారు. ఆయన వివరాల మేరకు, గోపాలపురానికి చెందిన కొవ్వూరి నాగిరెడ్డి(53) ఆదివారం రాత్రి ఇంటి నుండి కాలినడకన సెంటర్‌కు వస్తుండగా, వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తలకు, కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో, ఆయనను స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆయనకు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం

కొవ్వూరు: పట్టణంలో శ్రీరామకాలనీకి చెందిన కల్లాడ పవన్ అనే యువకుడు ఈ నెల 16 నుంచి కనిపించడం లేదని అతని తండ్రి రాజు ఫిర్యాదు చేసినట్టు ఎస్సై కె.జగన్‌మోహన్‌రావు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుంచి మోటార్ బైక్‌పై వెళ్లిన అతడు మళ్లీ తిరిగి రాలేదని చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కట్నం వేధింపులపై కేసు

తనను కట్నం కోసం భర్త వేధిస్తున్నట్టు స్థానిక శ్రీనివాసపురానికి చెందిన బర్రె చమ్మక్క పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై కె.జగన్‌మోహన్‌రావు వివరాల మేరకు, రెండేళ్ల క్రితం ముత్యాల రాజుతో ఆమెకు వివాహమైంది. నిత్యం మద్యం తాగొచ్చిన భర్త ఇంటికి ఎవరెవరినో తెచ్చి భార్యను అవమానిస్తున్నాడు. అదనపు కట్నం కోసం ఆమెను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కాలువల్లో పూడికల తొలగింపే ప్రధాన లక్ష్యం

పెరవలి: ప్రధానంగా కాలువల్లో పేరుకుపోయిన చెత్త, తూడు, గుర్రపు డెక్కతో పాటు, పూడుకుపోయిన కాలువలను తవ్వకాలు చేయటమే ప్రధాన లక్ష్యమని డిస్ట్రిబూటరీ కమిటీ చైర్మన్ బూరుగుపల్లి శ్రీనివాస్ తెలిపారు. పెరవలి ఇరిగేషన్ కార్యాలయం ఆవరణలో సోమవారం సాయంత్రం పెరవలి పరిధిలోని సాగునీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెరవలి ఇరిగేషన్ పరిధిలోని నీటి సంఘాల అధ్యక్షులు అత్యవసరంగా నివేదికలు సమర్పించాలన్నారు. లాకుల పరిధిలో చెత్తాచెదారాలు తొలగించి, మొక్కలు నాటాలని నిర్ణయించారు. కొన్ని కాలువల వద్ద గట్లు ఏర్పాటు చేయాలని, కుంగిన గట్ల స్థానంలో సిమ్మెంటు గోడలు నిర్మించాలన్నారు. చెక్ డ్యామ్‌ల మరమ్మతులు యుద్ధప్రాతిపదికన చేయాలని నిర్ణయించారు. ఇరిగేషన్ డీఈ వెంకటనారాయణ, ఏఈ ఎస్ బాలమురళీకృష్ణ, సాగునీటి సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.